క్లుప్తంగా

చెస్‌లో యువకుడి సత్తా



అంతర్జాతీయ రేటింగ్ సొంతం చేసుకున్న అనిల్‌కుమార్

గుంతకల్లుటౌన్: గత నెలలో బెంగుళూరులో జరిగిన ఆలిండియా ఓపెన్ ఫిడే రేటెడ్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో గుంతకల్లుకు చెందిన పూజారి అనిల్‌కుమార్ సత్తా చాటాడు. ర్యాపిడ్ విభాగంలో 9 రౌండ్లకు గానూ 5 రౌండ్లలో విజయం సాధించినట్లు ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఉదయ్‌కుమార్, సీనియర్ నేషనల్ ఆర్బిటర్ కర్ణాటకం నాగార్జున ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిడే ఇంటర్నేషనల్ సంస్థ తాజాగా విడుదల చేసిన రేటింగ్స్‌లో అనిల్‌కుమార్‌కు ర్యాపిడ్ విభాగంలో 1216 రేటింగ్ వచ్చిందన్నారు. కాగా పాతగుంతకల్లులోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న అనిల్‌కుమార్ చెస్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

వైభవంగా పెద్దమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

యల్లనూరు: మండల కేంద్రంలోని పాతపేటలో ఓబులేసుస్వామి ఉత్సవాన్ని వాల్మీకులు జరుపుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజామున ఓబులేసుడి ఉత్సవ విగ్రహాన్ని యల్లనూరుకు తీసుకెళ్లి, అనంతరం పూజలు చేశారు. వాల్మీకులు ఈ జాతరను సంతోషంగా జరుపుకున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

యాడికి: అక్రమంగా తరలిస్తున్న 24 పాకెట్ల (ఒక్కొక్కటీ 50 కేజీలు) రేషన్ బియ్యాన్ని బొలేరో వాహనంలో తరలిస్తుండగా ఆదివారం మండల కేంద్రంలోని కోన రోడ్డులో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గురు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి బియ్యం తరలిస్తున్న శివ, అనిల్‌పై కేసు నమోదు చేశామన్నారు.

రెండు గడ్డివాముల దగ్ధం



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

పెద్దవడుగూరు: మండల పరిధిలోని కండ్లగూడూరు గ్రామంలో ఆదివారం రెండు గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితులు వెంకటప్ప, యర్రన్న వివరాలమేరకు... ఆదివారం మధ్యాహ్నం సమయంలో వామిదొడ్డికి దూరంగా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఆ మంటలు వామిదొడ్డి వరకూ వ్యాపించాయన్నారు. దీంతో రెండు గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయని చెప్పారు. దీంతో సుమారుగా రెండు లక్షల రూపాయల దాకా నష్ట వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి పప్పుశనగ కొనుగోలు

విడపనకల్లు: మండల కేంద్రంలో సోమవారం నుంచి విడపనకల్లు,పెద్ద కొట్టాలపల్లి సొసైటీల ఆధ్వర్యంలో పప్పుశనగ, జొన్న కొనుగోలు చేస్తున్నట్లు విడపనకల్లు సొసైటీ చైర్మన్ బోయ శ్రీరాములు ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పప్పుశనగ, జొన్న సాగు చేసిన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్వింటాల్ పప్పుశనగ ధర రూ.5,330, జొన్న క్వింటాల్ రు.2,999లు మద్దతు ధరతో నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు.

స్టార్టర్, కేబుల్ చోరీ

కూడేరు: మండలంలోని అంతరగంగకు చెందిన రైతు కురుబ సిద్ధప్ప పొలంలో మోటార్‌కు అమర్చిన స్టార్టర్, కేబుల్ శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆదివారం రైతు పంటకు నీరు పెట్టేందుకు వెళ్లగా దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. దాదాపు రూ.10వేలు నష్టపోయాయని బాధిత రైతు వాపోయాడు. ఈ మేరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా రెండు నెలల క్రితం అంతరగంగలోనే ఓ రైతు పొలంలో స్టార్టర్ పెట్టె, నెల క్రితం కూడేరులో ప్రధాన రహదారి పక్కనే ఉన్న పెద్దమ్మ ఆలయంలో హుండీలో నగదు చోరీకి గురయ్యాయి. రెండు రోజులు క్రితం చోళసముద్రం గ్రామంలో బస్టాండ్ దగ్గర నివాసమున్న వ్యక్తి ఇంటి ముందు ఉంచిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. రాత్రి వేల పోలీసులు గస్తీ నిర్వహించి చోరీలు చోటు చేసుకోకుండా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.

ఆప్యాయంగా పలకరిస్తూ.. అభయమిస్తూ

- ఉత్సాహంగా పెద్దారెడ్డి 'సంక్షేమ' యాత్ర



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



పాదయాత్రకు భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు

పెద్దపప్పూరు: ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ.. సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి అభయమిస్తూ ముందుకు సాగుతున్నారు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి. ఆయన చేపట్టిన ప్రజాసంక్షేమ యాత్ర ఉత్సాహంగా సాగుతోంది. ఆరో రోజు ఆదివారం ప్రజా సంక్షేమయాత్ర పెద్దపప్పూరు మండలం బొందలదిన్నెలో ప్రారంభమై పెద్దయక్కలూరు, కొండాపురం, చెర్లోపల్లి వరకు సాగింది. పాదయాత్రలో భాగంగానే ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆయా ప్రాంతాల్లో ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పెద్దవడుగూరు, యాడికి, తాడిపత్రి మండలాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాదయాత్రకు తమ సంఘీభావాన్ని తెలిపారు. పెద్దయక్కలూరులో ఎస్సీ కాలనీ వాసులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించగా త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ కొంతమంది టీడీపీ నాయకులు అభివృద్ధిని జీర్ణించుకోలేక గ్రామాల్లో సమస్యలను సృష్టిస్తున్నారని తెలిపారు. ప్రజలందరూ ఆదరించి ఓట్లేస్తేనే తాను ఎమ్మెల్యేగా గెలుపొందానని, ప్రజా సమస్యలను తీర్చాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. కుల, మత, రాజకీయ భేదాలు ఉంటే ఏ గ్రామం అభివృద్ధికి నోచుకోదన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా నియోజకర్గ ప్రజలకు తాను అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఎమ్మెల్యే పెద్దారెడ్డి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథరెడ్డి, ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి, జిల్లా పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాద్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు హాజావలి, సర్పంచు రామేశ్వర్‌రెడ్డి (రాముడు) మండల నాయకులు ముచ్చుకోట అమర్‌నాథరెడ్డి, రఘునాథరెడ్డి, పెద్దయక్కలూరు శంకర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, కొండాపురం భాస్కర్‌రెడ్డి, చెర్లోపల్లి రామచంద్రారెడ్డి, రామిరెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు చెర్లోపల్లి నుంచి యాత్ర

ప్రజా సంక్షేమ యాత్ర ఏడవ రోజు చెర్లోపల్లి నుంచి తురకపల్లి చిన్నయక్కలూరు, చాలగల్లు వరకు సాగనుంది. పాదయాత్రకు సంఘీభావం తెలపడానికి మంత్రి ఉషశ్రీచరణ్, కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి విచ్చేస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి

విద్యార్థికి ఆర్థిక సాయం

పుట్లూరు: అనారోగ్యంతో బాధపడుతున్న వంశీ అనే విద్యార్థికి ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు దోగురు శ్రీహరి రూ.11,500 ఆదివారం అందించారు. కార్యక్రమంలో సేవా సంస్థ కార్యదర్శి నారబోయిన శంకర్, కన్వీనర్ శ్రీరంగయ్య, శ్రీనివాసులు, రంగయ్య, కుమారస్వామి, బీసీ యాదవ్, పెద్దారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

గుంతకల్లుటౌన్: పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త సత్రసాల జగదీష్ గుప్త సౌజన్యంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ హైస్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత చెవి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గకు చెందిన ఈఎన్‌టీ వైద్యులు పంచమి, సాయి ప్రశాంత్‌లతో పాటు మరో నలుగురు వైద్యులు చెవి సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న సుమారు 800 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరిలో 75 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు ప్రదీప్, డిష్‌రాము, క్యాంప్ చైర్మన్ శ్రీకాంత్, డాక్టర్ రామ్మూర్తి, కోఆర్డినేటర్ డీవీ సుబ్రమణ్యం, మాధవీలత, జోనల్ కార్యదర్శి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నమామి సాయి శత రుద్రీయం



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర వేదాధ్యాయన విభాగం ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక సత్యసాయి సేవాసమితి మందిరంలో వైభవంగా నిర్వహించారు. వేదాధ్యయనం రాష్ట్ర ఇన్‌చార్జ్ డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ శత జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 108 వేద పుష్పాలను సత్యసాయికి సమర్పించాలనే సత్సంకల్పంతో 2022 మర్చిలో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 33 వేదపుష్పాలను నిర్వహించామన్నారు. ప్రసుత్తం గుంతకల్లు నిర్వహిస్తున్నది 34వ వేద పుష్పమని వివరించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సంస్థల ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు డాక్టర్ రామచంద్రమూర్తి, సత్యసాయి బాలవికాస్ రాష్ట్ర కోర్డినేటర్ శకుంతల, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ సూర్యప్రకాష్, సభ్యుడు శంకర్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూమిలో ఆక్రమణల తొలగింపు



పుష్పగిరి పీఠానికి చెందిన కల్లూరు అగ్రహారం భూములు

గార్లదిన్నె/అనంతపురం కల్చరల్: గార్లదిన్నె సమీపంలోని కల్లూరు అగ్రహారంలో దేవదాయశాఖ భూమిలో ఆక్రమణలను ఎండోమెంట్ అధికారులు ఆదివారం తొలగించారు. ఎండోమెంటు అధికారులు, పెద్దఎత్తున పోలీసు బలగాలు అక్కడికి చేరుకొని ఆక్రమణలు తొలగించడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాలు.. కల్లూరు అగ్రహారంలో సర్వే నంబర్ 259లో 7.71 ఎకరాల భూమిలో ఇటీవల కొందరు జెండాలు పాతి, తాత్కాలికంగా గుడిసెలు వేసుకున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ రామాంజనేయులు, ఈఓ బాబు పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారుల సహాయంతో వాటి తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. ఇతర ఆలయాల ఈవోలు రామాంజనేయులు, రమేష్‌తో పాటు తొండపాడు అర్చకులు ఆక్రమణ ప్రదేశానికి చేరుకొని మద్దతు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఎండోమెంట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏసీ రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాలని ఈవోలకు సూచించారు.

రామ్మోహనరావుకు ఘన నివాళి

తాడిపత్రి టౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్టీసీ ఎన్ఎంయూ కార్యాలయంలో ఆదివారం రాజీవ్‌రత్న అవార్డు గ్రహీత , నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) వ్యవస్థాపకుడు రామ్మోహన్‌రావు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి యూనియన్ నాయకులు, కార్మికులు నివాళులర్పించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన రామ్మోహన్‌రావు సేవలను ఎన్ఎంయూ డిపో సెక్రటరీ ప్రతాప్‌నారాయణ కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, బాబు, ఎస్ఆర్‌కె రెడ్డి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్నివర్గాల సంక్షేమం



శింగనమలలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: వైఎస్సార్‌సీపీతో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఆదివారం మండలంలోని గురుగుంట్ల, వెస్ట్ నరసాపురం, చిన్నజలాలపురం, శింగనమల, తరిమెల, కల్లుమడి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి యువతకు ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఎంతో మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నారన్నారు. 6 లక్షలు మందికి ఉద్యోగాలు కల్పించాలని ధ్యేయం పెట్టుకున్నారన్నారు. విద్య, ఆరోగ్యానికి పెద్దపీట వేశారన్నారు. సంక్షేమ పథకాలను కుల, మత, పార్టీ భేదం లేకుండా అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చేపట్టిన అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నగేష్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఎస్వీ నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్, సర్పంచ్ వెంకట్రాముడు, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

తాతార్యారూఢస్వామి తిరునాల

గార్లదిన్నె: మర్తాడులో గ్రామస్తుల ఆధ్వర్యంలో తాతార్యారూఢ స్వామి తిరునాల ఆదివారం నిర్వహించారు. ఆలయంలో ఉదయమే స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. శనివారం రాత్రి పుష్ప రథోత్సవం గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ఘనంగా కృతజ్ఞతార్పణల పండుగ

పామిడి: పట్టణ సీఎస్ఐ చర్చిలో ఆదివారం కృతజ్ఞతార్పణల పండుగ ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గుత్తి డీసీ, పామిడి పాస్టర్ రెవరెండ్ జీ డేవిడ్‌నాయక్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో చర్చి సెక్రటరీ, సభ్యులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్

గార్లదిన్నె: కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామికి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు ఇరుసు, రాతిగుండు పోటీలు

యాడికి: శ్రీ శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి దేవాలయం ఎదురుగా సోమవారం ఉదయం 9 గంటలకు రాతి గుండు, ఇరుసు పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ రామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు రూ.100 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ

యాడికి: అనంతపురంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో యాడికి వాగ్దేవి స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల కరస్పాండెంట్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. భవ్య మొదటిస్థానం, సోహిత్ ద్వితీయ స్థానం, సాయి మేఘన జూనియర్ స్థాయిలో ద్వితీయ స్థానం, సీనియర్ స్థాయిలో మనోజ్ఞ మొదటి స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ విజేత 'ప్యాపిలి'



ప్యాపిలి జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

యాడికి: శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండు రోజులుగా మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి దేవాలయం ముందు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో నంద్యాల జిల్లా ప్యాపిలి జట్టు విజేతగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు తెలిపారు. ఆదివారం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కబడ్డీ పోటీలకు 40 టీములు హాజరయ్యాయి. పోటాపోటీగా జరిగిన కబడ్డీ పోటీల్లో ప్యాపిలి జట్టు విజేతగా నిలిచింది. వీరికి యాడికి గౌస్ మహమ్మద్ రూ.40 వేల నగదు అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన అనంతపురం జిల్లా యాడికి మండలం కేశవరాయునిపేట జట్టుకు యాడికికి చెందిన హరిప్రసాద్, హరికృష్ణ రూ. 30 వేలను అందించారు. మూడోస్థానంలో నిలిచిన అనంతపురం వివేకానంద స్పోర్ట్స్ క్లబ్‌కు కోటి రమేష్ రూ.20 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన తమిళనాడు రాష్ట్రం సేలం జట్టుకు డాక్టర్ శిరీష రూ.10 వేలను అదించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొంబాయి రామిరెడ్డి, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు నాగరాజు, రామ్మోహన్, వెంకటరాముడు వార్డు మెంబర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం



దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్: రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయమని తహసీల్దార్ మునివేలు తెలిపారు. స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 55 మంది దివ్యాంగులకు నిత్యావసర వస్తువుల కిట్స్‌ను తహసీల్దార్ మునివేలు, క్లబ్ సభ్యులు పంపిణీ చేశారు. అనంతరం తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ పేద దివ్యాంగుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కొన్నేళ్లుగా రోటరీ క్లబ్ సభ్యులు దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తుండటం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు షాకీర్ , కార్యదర్శి కిషోర్, సభ్యులు నాగేంద్ర, రామయ్య, మద్దిలేటి, బాబు, మాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు నాగలింగేశ్వర స్వామి ఉత్సవాలు



నాగలింగేశ్వరస్వామి మూలవిరాట్

బుక్కరాయసముద్రం: నీలంపల్లి గ్రామంలో నాగలింగేశ్వరుడి ఉత్సవాలు సోమ, మంగళవారం నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం ఆలయంలో నాగలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరగనున్నాయి. అదేరోజు రాత్రి 10 గంటల నుంచి 1.30 గంటల వరకు గణపతి పూజ, పుణ్యాహ వచనం, మహా మంగళ హారతి, ప్రాకార సంప్రోక్షణ, రాత్రి 12 గంటలకు స్వామి వారి రథోత్సవాన్ని గ్రామంలో ఊరేగించనున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుంది. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు ఆలయంలో అన్నదానం ఉంటుంది. రాత్రి 11.50 గంటల నుంచి 2.30 గంటల వరకు అంకాదహనం ఉంటుంది.

ఆకట్టుకుంటున్న చేనేత ప్రదర్శన



చేనేత హస్తకళా ప్రదర్శనలో కొనుగోలు చేస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ఆదివారం సెలవు దినం కావడంతో చేనేత వస్తువులను కొనుగోలు చేసేందుకు నగర ప్రజలు ఎగబడ్డారు. కొండపల్లి బొమ్మలు, ఖాదీ షర్ట్స్, సహరన్‌పూర్ ఫర్నీచర్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, హైదరాబాద్ పెరల్స్, శారీస్, మైసూర్ పెయింటింగ్స్, ఫ్లవర్స్, ఇంటికి శోభనిచ్చే హస్తకళా బొమ్మలు, ఇలా వేలాది వెరైటీలను ప్రదర్శనలో ఉంచారు.

నేడు 'స్పందన' రద్దు

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరగనున్న స్పందన కార్యక్రమం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా రద్దు చేసినట్లు తహసీల్దార్ రమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. యల్లనూరు మండల ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గమనించాలని తహసీల్దారు కోరారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి



వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు రంగనాథరెడ్డి

గుంతకల్లుటౌన్:పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేయనున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం పట్టణంలోని 5, 9వ వార్డుల్లో కౌన్సిలర్లు భాస్కర్, రవీంద్రతో కలిసి వారు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. అలాగే పట్టణంలోని వివిధ వార్డుల్లో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ అనుబంధ సంఘాలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

పామిడి: పామిడి పట్టణ, రూరల్ గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డి విజయం కోసం పార్టీశ్రేణులు ముమ్మర ప్రచారం చేపట్టారు. స్థానిక 14,15 వార్డుల్లో పామిడి మండల సచివాలయ పట్టణ కన్వీనర్ బీ ఆసిఫ్, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూధన్‌రెడ్డి సంయుక్త సారథ్యంలో ఎమ్మెల్సీ ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. అలాగే పట్టణ 4, 5 వార్డుల్లో వార్డు ఇన్‌చార్జ్ పార్వతీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. పార్టీ ముస్లీం మైనార్టీ నాయకులు బీకే అన్వర్‌బాషా, కే ఎం మహబూబ్‌బాషా, అబుసాలేహా సారథ్యంలో కోటవీధి, చాకలివీధిలో ప్రచారం చేశారు. రూరల్ గ్రామాల్లో పార్టీ మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, పామిడి మండల సచివాలయ రూరల్ కన్వీనర్ ఎం.కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమాల్లో పార్టీ మండల నాయకులు, సచివాలయ కన్వీనర్లు హరినాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, విష్ణు, రఘునాథ్‌రెడ్డి, చాకలి సుంకన్న, భాష, హనీఫ్, వెంకటేష్, పెద్దావలి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్ : స్థానిక నంద్యాల రోడ్డు, శ్రీరాములపేట, సుంకులమ్మపాలెంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు రంగనాథరెడ్డి ప్రచారం చేశారు. రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

పెద్దపప్పూరు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఎన్నికల కో-ఆర్డినేటర్ చెన్నకేశవరెడ్డి పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమ యాత్రలో భాగంగా చెర్లోపల్లి గ్రామంలో తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేతుల మీదగా ఎన్నికల బ్యాలెట్ నమూనాను ఆవిష్కరించారు.

యాడికి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని మండలంలోని తూట్రాళ్లపల్లె సర్పంచు సంజీవరాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ శివప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం డీలర్లు ముత్యాలరెడ్డి, మల్లికార్జునతో కలిసి తూట్రాళ్ల పల్లె, కొత్తపల్లె గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.